మోగిన సమస్యల గంట

- అసౌకర్యాల నడుమ పాఠశాలలు పునఃప్రారంభం
- పూర్తిగా అందని పుస్తకాలు, విద్యార్థి కిట్లు
- అసంపూర్తిగా ఉన్న గదులలోనే విద్యా బోధన
- మధ్యాహ్న భోజనంలో నాణ్యత కరువు



నందవరం మండలం ఇబ్రహీంపురం హైస్కూల్‌లో అసంపూర్తి గదుల్లో తరగతి నిర్వహణ



ఎస్‌ఎంహెచ్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఆదోని సెంట్రల్: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పునఃప్రారంభానికి ముందు రోజు పాఠశాలలను సంసిద్ధం చేసి పాఠశాలలను ప్రారంభించేవారు. అదే రోజు విద్యార్థులకు ఏడు వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించే వారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు విద్యామిత్ర, తల్లికి వందనం పంపిణీ చేస్తామని గొప్పలు చెప్పుకున్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదనే విమర్శలు వినబడుతున్నాయి.

సమస్యల స్వాగతం

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, గురుకులం పాఠశాలలు 130 ఉన్నాయి. అయా పాఠశాలల్లో 30,004 మంది విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటున్నారు. గురువారం అసౌకర్యాల మధ్యనే మొక్కుబడిగా పాఠశాలలు పునఃప్రారంభం కాగా 9వేల మంది మాత్రమే హాజరయ్యారు. చాల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేవు. టాయిలెట్స్, బెంచీలు వంటి సౌకర్యాలు కూడా సరిగా లేవు. మధ్యాహ్న భోజనంలో కూడా నాణ్యత అంతంత మాత్రంగానే విమర్శలు వినబడుతున్నాయి.

అందని 'విద్యార్థి మిత్ర'

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులు అంతా పేద మధ్య తరగతి విద్యార్థులే కనుక ఆ భారం తల్లిదండ్రుల మీద పడకూడదని గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లును పంపిణీ చేసేవారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకొంటున్న విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజే వారికి అందించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాకానుక పేరు మార్చి సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్‌ఆర్‌కేవీఎం) పేరు పెట్టింది. పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తామని పేపర్లలో సోషల్ మిడియాలలో గొప్పలు చెప్పారు. అయితే ఇంత వరకు 1,76,798, 1,31,000, డిక్షనరీలు 20150, పిక్చర్ డిక్షనరీలు 3,145, బెల్టులు 2177 వచ్చాయి. పాఠ్యపుస్తకాలు ఇంకా 5 శాతం రావాల్సి ఉంది. ఇంకా స్కూల్ యూనిఫ్యామ్స్, బ్యాగు, షూష్, సాక్స్‌లు వంటివి రావాల్సి ఉంది. వచ్చిన వాటిని కూడా పంపిణీ చేయలేదు

అందని 'తల్లికి వందనం'

విద్యార్థుల చదువులకయ్యే ఖర్చు తల్లిదండ్రుల మీద పడకూడదని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమ్మ ఒడి పేరు మీద రూ.15000లు అందించే వారు. కూటమి నాయకులు అధికారంలోకి రాక ముందు ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు రూ.15000 అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి పేరును తల్లికి వందనం మార్చారు. పాఠశాలలు పున:ప్రారంభం రోజు అందిస్తామని చెప్పడంతో ఎంతో మంది నిరుపేద తల్లిదండ్రులు ఎంతగానో ఎదురు చూశారు. తల్లికి వందనంపై ఎలాంటి స్పష్టత రాక పోవడంతో నిరాశచెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారు చెప్పే విధానానికి, చేసే పనులకు ఎలాంటి పొందిక ఉండదని పలువురు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతకు తిలోదాకాలు

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పోషక విలువలతో పాటు రుచికరంగా ఉండాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మోనూలో పలు మార్పులు చేశారు. రోజు ఒక రకమైన భోజనంతో పాటు గుడ్డు, చిక్కిలు, రాగిజావ వంటివి అందించేందుకు చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజనానికి జగనన్న గోరుముద్ద పేరు మార్చి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా పేరు మార్చింది. అయితే వంట నిర్వాహకులను చాల చోట్ల మార్చడం వలన నాణ్యతకు తిలోదాకాలు ఇస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభం రోజే విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన భోజనం వడ్డిస్తామని గొప్పలు చెప్పారు. పాఠశాలలకు బియ్యం పంపిణీ చేసినా అవి మెత్తగా, ముద్దగా అవుతుండటంతో మామూలు బియ్యాన్నే పాలస్ చేసి పాఠశాలలకు పంపినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కరువు

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని మనబడి నాడు–నేడు పనులకు గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో టాయిలెట్స్, బెంచీలు, విద్యుత్తు వంటి సౌకర్యాలను కల్పించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు కూడా ఉండాలని అదనపు గదుల నిర్మాణాల పనులను కూడా చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, టాయిలెట్లు తదితర సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అరకొర వసతులతో విద్యార్థులు

నందవరం : వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. కూటమి సర్కార్ విద్యార్థులు కనీస వసతులు కల్పించ లేక పోయింది. మండలంలో 45 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందుల్లో 9,468 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి 41,312 పాఠ్య పుస్తకాలు, 6 నుంచి 10వ తరగతి వరకు 45,638 నోట్ పుస్తకాలు వచ్చాయి. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఆయా స్కూల్‌లకు ఎంఆర్సీ నుంచి తరలించారు. అయితే విద్యార్థులకు యూనిఫాం, బెల్టు, షూస్, టైలు రాలేదు. కొన్ని పాఠశాలలో నీటి వసతి, టాయిలేట్లు, విద్యార్థులకు తరగతి గదులు లేక పోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు– నేడు కింద పనులు చేపట్టి కూటమి వచ్చిక నిలిచిపోయిన అసంపూర్తి అదనపు గదులులలో కుర్చోని విద్య బోధన సాగుస్తున్నారు. సరైన వసతులు లేక, కనీసం బండపరుపు లేకపోవడంతో విద్యార్థులు ఆ గదులలో పట్టాలు వేసుకుని కుర్చుంటున్నారు.

తొలిరోజు 10 శాతం హాజరు

కోసిగి : 2025 – 26 విద్యాసంవత్సరం గురువారం ప్రారంభమయ్యాయి. కోసిగి మండలంలో 33ప్రాథమిక, 13 ఉన్నత పాఠశాలలు, ఒక ఆదర్శ, ఒక కస్తూరీబా పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1నుంచి 10వ తరగతి వరకు 15,287మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందుకు గానూ 68,687పాఠ్యపుస్తకాలు మంజూరు అయ్యాయి. మొదటి రోజున పాఠశాలలకు 10శాతం మందికూడా హాజరు కాలేదు. వచ్చిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఎంఈఓ శోభరాణి సమక్షంలో పంపిణీ చేశారు. ఇంకా బ్యాగులు, బట్టలు రాలేదు. కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే అందించి అధికారులు చేతులు దులుపుకున్నారు. మండలంలో నాడు నేడు రెండవ విడత కింద 39పాఠశాలలకు రూ. 23కోట్లు కేటాయించారు. ఇందుకు రూ. 11.43కోట్లు మంజూరు అయ్యింది. దాదాపు ఏడాది నుంచి బిల్లులు మంజూరు కాక పాఠశాలలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

మండల వ్యవసాయాధికారిగా ఎం.శివశంకర్



ఎమ్మిగనూరురూరల్: మండల వ్యవసాయాధికారిగా ఎం.శివశంకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహేశ్వరరెడ్డి పాములపాడు మండలానికి బదిలీ కాగా హాలహర్వి మండలం నుంచి ఎం. శివశంకర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఏవోకు కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరభ్యాసము చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెద్దకడబూరు : పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు జయమ్మ, చిట్టెమ్మ, ఆదిలక్ష్మి, సుకన్య మాట్లాడుతూ 3 సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ సెంటర్‌లలో చేర్చుకుంటామన్నారు.

కిశోర వికాసంపై అవగాహన ర్యాలీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో గురువారం పాఠశాల ఉపాధ్యాయులతో పాటు, అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో కిశోర వికాసం, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు చిట్టెమ్మ, ఉమాదేవి, శశికళ, ఉపాధ్యాయులు రంగన్న, హసాన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కూటమి



మాట్లాడుతున్న నజీర్ అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన విధానాలు అవలంబిస్తూ విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన, విద్యార్థి విభాగాల అధ్యక్షులు నజీర్‌అహమ్మద్, బలరాంయాదవ్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభ్యున్నతికి గాను ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు వసతి దీవెన లాంటి పథకాలతో విద్యార్థులకు భరోసా ఇచ్చారన్నారు. అయితే ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయక మోసం చేసిందన్నారు. సమావేశంలో పార్టీ యువనాయకుల హుసేన్, విజయ్, నబి,రసూల్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

నందవరం : రైతులు పత్తి సాగులో విత్తనశుద్ధి చేసుకోవాలని, తద్వారా తెగులు, చీడపీడలు నివారించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) బనవాసి శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి. నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటలో సాగులో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఆదోని రూరల్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన పారువేటలో గెలుపొందిన కృష్ణారెడ్డి వృషభాలకు గురువారం రాత్రి బహుమతి అందజేశారు. గ్రామంలో ఎద్దుల పరుగు పోటీల్లో గెలిచిన కృష్ణారెడ్డి వృషభాలకు పెండేకల్ శివయ్య అభినందించి బహుమతిని అందించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం





పూజలందుకుంటున్న శ్రీ జమ్ములమ్మ దేవి,బిందెలతో అమ్మవారికి నీటిని తీసుకెళ్తున్న మహిళలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సోగనూరు రోడ్డులో వెలసిన జమ్ములమ్మ దేవి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను గురువారం వైభవంగా జరుపుకున్నారు. ఆలయ ధర్మకర్త, మాజీ కౌన్సిలర్ తట్టే బుడ్డప్ప ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మహిళలు కన్యకాపరమేశ్వరి స్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా బిందెల్లో నీటిని జమ్ములమ్మ దేవాలయం వరకు తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. దేవాలయంలో ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకోవటంతో సందడిగా మారింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాదగుండు నీలకంఠప్ప, బుగుడే తిమ్మప్ప, మరిడి దుష్యంత్, బుగేడే శ్రీనివాసులు, చాయ శ్రీనివాసులు, మాదగుండు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులుగా మారొద్దు



మాట్లాడుతన్న జడ్జి సుభాష్

ఆదోని రూరల్: కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎవరూ బాల కార్మికులుగా మరొద్దని, బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఆదోని ఫస్ట్ అడిషనల్ జ్యూడిషియల్ జడ్జి సుభాష్ అన్నారు. గురువారం సాయంత్రం ఆదోని పట్టణ శివారులోని కల్లుబావి వీధిలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్జి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపి విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కోర్టు నామినేటెడ్ మెంబర్ మమత లోకేష్‌కుమార్, టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, కార్మిక అధికారులు ప్రతాప్‌రెడ్డి, సుందర్, మండల లీగల్ కమిటీ మెంబరు కళ్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల మాటేమిటి బాబు?



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు

ఆదోని టౌన్: అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చావా బాబు అంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ యువత, మహిళలకు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయి బాబు అంటూ నిలదీశారు. గురువారం ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్‌లు నరసింహులు, అబ్దుల్‌గౌస్, కౌన్సిలర్లు చలపతి, నాయకుడు నాగరాజు, కౌన్సిలర్లు అశోక్, కిషోర్, ఇంతియాజ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి కల్పిస్తానని నేటికి ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని అయినా నెరవేర్చలేదన్నారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు, రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చారని, అందులో ఏది అమలు చేశారో చెప్పాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని నిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

క్షయవ్యాధి నిర్మూలిద్దాం

ఆదోని టౌన్: క్షయవ్యాధి నిర్మూలనలో భాగమవుదామని కౌన్సిలర్ సురేష్, డాక్టర్ త్రివేణి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అరుణ్‌జ్యోతినగర్ యూపీహెచ్‌సీలోని బావాజీపేటలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, గల్లులో రక్తపు చారలు పడినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో గల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎంలు వాణి, ఆశావర్కర్లు లక్ష్మి, వరలక్ష్మి, అమృత తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



అధికారులకు సూచనలిస్తున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదోని మున్సిపాలిటీలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి శానిటేషన్ సెక్షన్ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలకు సూచించారు. గురువారం ఆమె చాంబర్‌లో శానిటేషన్‌పై అధికారులతో సమీక్షించారు. ప్రధాన రోడ్లు, సర్కిళ్లు, మురికివాడలు, శివారు ప్రాంతాల్లో తడిపొడి చెత్త ఏరోజుకారోజు ఎత్తివేసి వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, చెత్తకుప్పలు ఎక్కడికక్కడే నిల్వ ఉండినట్లయితే ఈగలు, దోమలు అపరిశుభ్రత కారణంగా ప్రజలు అనారోగ్యంపాలయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ ఇంతియాజ్, శానిటరీ సెక్షన్ అధికారులు నాగరాజ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్ సందర్శన

ఆదోని టౌన్: పట్టణంలోని మున్సిపల్ స్కూల్‌ను గురువారం ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్. లోకేశ్వరి సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న అడ్మిషన్లు, పిల్లల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందేలా చూడాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

వేలం పాట..కూటమి ఆట!

- గురజాల భూముల వేలాల్లో వాయిదాల పర్వం
- ఎమ్మెల్యే జోక్యం వల్లేనని అరోపణలు
- అనుకూలురకు వశం చేసేందుకు పన్నాగం
- కాలయాపనతో కర్షకుల్లో ఆందోళన



సేద్యానికి నోచుకోని గురజాలలోని రామలింగేశ్వర స్వామి ఆలయ భూమి

నందవరం : దేవాలయ భూముల వేలం పాటలో కూటమి నేతల ఆట మొదలైంది. వంత పాడుతున్న అధికారుల పుణ్యాన పవిత్ర పుణ్యక్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి మాన్యం భూముల వేలం పాటల వాయిదాల పర్వం కొనసాగిపోతోంది. భూముల యాక్షన్‌లో ఎమ్మెల్యే రియాక్షన్ కారణంగా వేలాలు రెండు పర్యాయాలు వాయిదా పడగా..అధికారుల కాలయాపనతో కర్షకుల పాలిట శాపంగా మారింది. ఓ వైపు ముందస్తు మురిపిస్తున్నా..వేలం పాట లేక ఆలయ భూములు బీళ్లుగా మారాయి. వాయిదాల వెనుక అనుకూల వర్గాల వశం చేయాలన్నదే పరమావధిగా కనిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయ భూముల వివరాలు

దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయానికి 94.26 ఎకరాల భూములు ఉన్నాయి. అందులో గ్రామంలో సర్వే నంబర్ 156లో 15.29 ఎకరాల్లో డోలు మాన్యం భూమి, 92 సర్వే నెంబర్‌లో 19.11 ఎకరాలు బురుజు మాన్యం, సర్వే నెంబర్ 87లో 18.28 ఎకరాలు శివయ్య సొడు చేను, సర్వే నెంబర్ 31లో 2.81 ఎకరాలు కుమ్మరి వారి చేను, 190 సర్వే నెంబర్‌లో14.63 ఎకరాలు నంది దీపం పొలం, సర్వే నెంబర్ 75లో 24.14 ఎకరాలు కర్లీక్ మాన్యం భూమి ఉంది. ఇందులో డోలు మాన్యం భూమి మాత్రమే తుంగభద్ర నది నుంచి పొలానికి పైపులైన్ నిర్మాణం చేపట్టారు. రెండు కారుల పంటలు పండిస్తారు. మిగిలిన భూములు మెట్ట పొలాలు. ఒక కారు పంట పండుతోంది.

వాయిదాల పర్వం

గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో ఉగాది పండుగ తరువాత వేలం నిర్వహించి రైతులకు అప్పగించే వారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఆలయ భూముల వేలంలో ఎమ్మెల్యే జోక్యంతో వాయిదాల పర్వం మొదలైంది. గురజాల క్షేత్రంలో ఈ ఏడాది ఏప్రిల్ 23, 2025న ఆలయ ఈఓ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. టీడీపీ నాయకుల జోక్యంతో వేలం రద్దు చేశారు. రెండవ సారి ఈ నెల 6వ తేదీన వేలం వేయాల్సి ఉండగా మరో సారి దేవదాయశాఖ అధికారులు వాయిదా వేశారు. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. చివరిగా ఈ నెల 13వ తేదీన ఆలయ భూములు వేలం నిర్వహిస్తామని ఆలయ అధికారులు చెబుతున్నారు.

నేడు తప్పనిసరిగా వేలం నిర్వహిస్తాం

ఈ నెల 13వ తేదీన గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ భూములు వేలం నిర్వహిస్తాం. రైతులు స్వచ్ఛందంగా రూ.5 వేలు డిపాజిట్లు చెల్లించి వేలం పాటలో కొనసాగవచ్చు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ భూములు వేలం చేపడతాం. ఇప్పటికే ఆలస్యమైనది వాస్తమే..ఈ సారి తప్పని సరి వేలం పూర్తి చేస్తాం.

– పిసి.రాంప్రసాద్, ఈఓ, గురజాల క్షేత్రం

కన్నీళ్లు పెట్టిస్తున్న కాలయాపన

సక్రమంగా వేలాలు ముగిసి ఉంటే ఈపాటికే రైతులు దుక్కులు పూర్తి చేసుకుని విత్తు వేసేవారు. రాజకీయ జోక్యంతో వేలాలు నిర్వహణలో అధికారులు దోబూచులాడుతున్నారు. ఈ కాలయాపన కారణంగా అన్నదాతలు కలత చెందుతున్నారు. దీంతో ఆలయ భూములన్నీ బీడులుగా మిగిలిపోతున్నాయి. ఓ వైపు ఆశా జనకంగా వర్షాలు కురుస్తున్నాయి..మరో వైపు అనుకూల కార్తెలు కరిగిపోతోన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వేలాలను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారైన వేలం పాట సక్రమంగా సాగుతుందో..లేదోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మున్సిపల్ కార్మికుల ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని గురువారం పట్టణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యునియన్ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. యునియన్ అధ్యక్షుడు ఎం.నారాయణ మాట్లాడుతూ కార్మికులు రోజుల తరబడి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజలు



పరుగుపందెంలో యువకులు

కోసిగి : మండల కేంద్రంలోని కొండపై వెలసిన తిమ్మప్పస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఏరువాక పౌర్ణమి రెండవ రోజును పురస్కరించుకొని సంప్రదాయంగా కోసిగి ప్రాంత ప్రజలు, భక్తులు కొండపైకి ఎక్కి నారికేళలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, ఆకుపూజ, వెండికవచ అలంకరణ, ఫల, పుష్పాలు సమర్పించి ప్రత్యేక హారతులతో పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారి దర్శన అనంతరం కొండపై ఆహ్లాదకర వతావరణంలో సేదదీరారు. సాయంత్రం కొండ దిగువ ప్రాంతంలో యువకులు పరుగు పందెం పోటీలు నిర్వహించారు.

కౌతాళంలో కుండపోత వర్షం



రౌడూరు గ్రామంలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



గంజిహళ్లి గ్రామం దగ్గర పొంగి పొర్లుతున్న మల్లెల వాగు

కౌతాళం: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన కుండపోత వర్షానికి కౌతాళంతో పాటు పలు గ్రామాల్లో ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై వర్షపు నీరు పారింది. జంగాల కాలనీలో ఇళ్లలోకి నీరు చేరాయి. అలాగే జెడ్పీ పాఠశాల ఏరియా, మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీ, ఇళ్లల్లో వర్షపు నీరు చేరాయి. దీనితో పాటు మండల పరిధిలోని రౌడూరు, ఎరిగేరి గ్రామాల్లో సైతం ఇళ్లలో నీరు చేరడంతో నీరు తోడుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. ఏ వీధి చూసినా వర్షపు నీరు రెండు అడుగులతో మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవాహించింది.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

గోనెగండ్ల : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురిసింది. రాత్రి నుంచి ఉదయం వరకు కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. హంద్రీనది పరివాహక ప్రాంతాలు ఆలూరు, ఆస్పరి, ఆదోని తదితర ప్రాంతాల్లో కూడా వర్షాలు కురువడంతో అగ్రహారం, గంజిహళ్లి మల్లెల వంకకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చింది. దీంతో మల్లెల వాగు వంక ఒక్కసారిగా పొంగి పొర్లింది. దీంతో గంజిహళ్లి నుంచి బైలుప్పల, అగ్రహారం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటి ప్రవాహం తగ్గిన అనంతరం వాహనాల రాకపోకలు కొనసాగాయి.

నందవరంలో 31.6 మీ. మీటర్ల వర్షపాతం

నందవరం : నందవరం మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలో 31.6 మీ.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వర్షానికి రైతన్నలు విత్తన పనులకు ఉపక్రమించారు. ముందుగా సాగు చేసిన పంటలకు ఈ వర్షం ప్రాణం పోసింది. సాగు చేసిన పంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో గట్లను తెంచి వంకలు, కాలువలోకి వదిలారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతూన్న స్పెషల్ డీప్యూటీ కలెక్టర్ కే. అనురాధ

మంత్రాలయం రూరల్ : ఈ నెల 21వ తేదీన నిర్వహించే యోగాంధ్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ డీప్యూటీ కలెక్టర్ కే. అనురాధ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్జహాన్ ఆధ్వర్యంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి యోగాంధ్రపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..ఈ నెల 14వ తేదీన అన్ని గ్రామ పంచయతీల్లో యోగాపై ట్రైల్‌రన్స్ చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 18న శ్రీమఠం ఆవరణలో 1000 మందితో యోగాతో మెగా ఈవెంట్ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా హాజరవుతారని వివరించారు. అందకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని మండల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎంఈఓ మెయినుద్దీన్, ఏపీఓ భక్తవత్సలం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

మంత్రాలయం రూరల్ : ఓటర్ల నమోదు, కొత్త పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పాత పోలింగ్ కేంద్రాల ఆధునికీకరణపై అధికారులు పర్యవేక్షణ ఉండాలని స్పెషల్ డీప్యూటీ కలెక్టర్ కే. అనురాధ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 145 అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు, అధికారులకు స్పెషల్ డీప్యూటీ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..అన్ని రాజకీయ పార్టీ నాయకులు ఓటర్ల జాబితాను పునఃపరిశీలిన చేసి మార్పులు, చేర్పులు ఉంటే సరిచూసుకోవాలన్నారు. 18 ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రాలయం నియోజకవర్గ తహసీల్దార్లు రవి, గీతా ప్రియదర్శిని, రజినీకాంత్‌రెడ్డి, రుద్రగౌడ్, డీటీ గురురాజరావు, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.